
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం • 6 • సెప్టెంబర్ • 2025



సోమశిలలో 66.240 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శుక్రవారానికి 66.240 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 25,288 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,09,600
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,847
మూడు శాతం జీఎస్టీతో	రూ.10,142
నవర (8 గ్రాములు)	రూ.81,136

గరిష్టం/కనిష్టం
37.7 /28.9

వాతావరణం

జిల్లాలో ఎండల తీవ్రత శనివారం అధికంగా ఉంటుందని వాతావరణ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 47 శాతంగా శుక్రవారం నమోదైంది.

పైసలిస్తేనే.. ఫైలు కదిలేది

**పేరుకే ఆన్‌లైన్..
జరిగేదంతా ఆఫ్‌లైన్లోనే**

- నెట్‌లో అప్‌లోడ్ చేస్తే నెలల తరబడి పెండింగ్
- ఏజెంట్ ద్వారా అయితే వెంటనే పరిష్కారం
- పేరుకుపోయిన మూడు వేలకుపైగా దరఖాస్తులు
- రవాణా కార్యాలయంలో ఇదీ తంతు



రవాణా శాఖ జిల్లా కార్యాలయం

నెల్లూరు (టౌన్): జిల్లా రవాణా శాఖలో ఆన్‌లైన్ వ్యవస్థ పేరుకే పరిమితమైంది. కార్యకలాపాలు మాత్రం ఆఫ్‌లైన్లోనే జరుగుతున్నాయి. వాహనానికి సంబంధించిన ఏ ట్రాన్సాక్షన్ ఉన్నా కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని, సెల్‌ఫోన్లో స్వయంగా లేదా ఆన్‌లైన్ కేంద్రంలో సంబంధిత డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేస్తే వెంటనే పరిష్కరిస్తామని రవాణా అధికారులు తరచూ పేర్కొంటున్నారు. అయితే సదరు ప్రకటన పేరుకే పరిమితమైంది.

పెండింగ్‌లో ఉంచుతూ..

వాస్తవానికి దరఖాస్తులను ఏ రోజుకా రోజు పరిష్కరించే అవకాశం ఉన్నా, వాటిని సంబంధిత సెక్షన్ అధికారులు పెండింగ్‌లో ఉంచుతున్నారు. స్వయంగా అప్‌లోడ్ చేసినా, ఏజెంట్ ద్వారా వెళ్లినా తమ పైసలు తమకు ముట్టజెప్తేనే మీ సమస్యకు పరిష్కారం లభిస్తుందంటూ అక్కడి అధికారులు, ఉద్యోగులు బహిరంగంగా చెప్తున్న పరిస్థితి నెలకొంది.

వామ్మో.. ఇన్నా..!

జిల్లా రవాణా కార్యాలయంలో ప్రస్తుతం మూడు వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయంటేనే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతోంది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారికి ఎవరైనా ఫిర్యాదు చేస్తే సంబంధిత డాక్యుమెంట్‌కు నెలలు దాటినా పరిష్కారం లభించని దుస్థితి ఉంది. పెండింగ్ డాక్యుమెంట్ విషయమై కార్యాలయం లోపలికెళ్లి అధికారులను కలవాలని భావిస్తే, గేట్ వద్దే అడ్డుకుంటున్న పరిస్థితీ ఉంది.

నిబంధనలా.. తూచ్

జిల్లా రవాణా శాఖలో 80కుపైగా సేవలను ఆన్‌లైన్ చేశారు. ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకుంటే వారంలో పరిష్కరించాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ పరిస్థితి దీనికి భిన్నంగా మారింది. సంబంధిత డాక్యుమెంట్‌కు ప్రభుత్వ చలానాతో పాటు అదనంగా డబ్బులు ముట్టజెప్తే పరిష్కారం లభిస్తోంది.

కొందరికి మాత్రం పెద్దపీట

రవాణా శాఖలో గతంలో ఈ – ప్రగతి వెబ్‌సైట్ ద్వారా కార్యకలాపాలు సాగేవి. ప్రస్తుతం వాహన్ వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చింది. దీని ద్వారా ఏ రోజుకా రోజు దరఖాస్తులను క్లియర్ చేసే అవకాశం ఉన్నా, పెండింగ్‌లోనే ఉంచుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే రకరకాల సాకులు చెప్తున్నారు. మరోవైపు ఫైనాన్షియర్లు, సెకండ్ హ్యాండ్ వాహనాల డీలర్లతో కార్యాలయంలో పనిచేసే అధికారులు నేరుగా సంబంధాలు పెట్టుకుంటున్నారు. ఇలా రోజూ పదుల సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నా, వాటిని మాత్రం పెండింగ్‌లో ఉంచడంలేదు. అదే సామాన్యులకైతే ఇక్కట్లు తప్పడంలేదు. దరఖాస్తు పెండింగ్‌పై ఆన్‌లైన్ కేంద్రాల నిర్వాహకులను సంప్రదిస్తే, నేరుగా వెళ్తే మీ సమస్యకు పరిష్కారం లభించదని, అదే తమ ద్వారా అయితే చకచకా జరిగిపోతుందంటూ బహిరంగంగా చెప్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

వాహన పేరు మార్పు, ఫైనాన్స్ రద్దు, ఫైనాన్స్ నోటింగ్, ఈ – కేవైసీ, పేరులో మార్పులు, ఆధార్ సీడింగ్, వాహనం లేకపోయినా వారి ఆధార్ నంబర్‌పై ఉన్నట్లయితే దాని తొలగింపు తదితర కార్యకలాపాలకు యథేచ్ఛగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి డాక్యుమెంట్‌కు రూ. వెయ్యి నుంచి రూ.మూడు వేలను అదనంగా వసూలు చేస్తున్నారని సమాచారం. మరోవైపు కార్యాలయ బయట ఏజెంట్లే ఆన్‌లైన్ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. వారి ద్వారా వెళ్తే నేరుగా పనవుతోంది. అలా కాకుండా స్వయంగా వెళ్తే చుక్కలు చూపిస్తున్నారు.

బయోమెట్రిక్‌తోనే ఈ సమస్య

ఫైనాన్షియర్ వద్ద బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుంది. అక్కడ ఈ సమస్య తలెత్తుతోంది. దీంతో దరఖాస్తులు పెండింగ్‌లో పడుతున్నాయి. ఈ విషయంలో అధికారుల నుంచి ఒత్తిడి ఉంది. పెండింగ్‌లో ఉన్న వాటిని క్లియర్ చేసే పనిలో ఉన్నాం. రాష్ట్రమంతటా ఇదే సమస్య ఉంది.

– మదానీ, ఆర్టీఓ

ఇలాంటి రాజకీయాలను ఎప్పుడూ చూడలేదు

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- ప్రసన్న కుటుంబీకులకు పరామర్శ



ప్రసన్న కుటుంబీకులతో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో ప్రస్తుతమున్న రాజకీయాలను ఎన్నడూ చూడలేదని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సుజాతమ్మ కాలనీలోని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసానికి శుక్రవారం వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించిన అనంతరం కాకాణి మాట్లాడారు. రాష్ట్రంలో హుందా రాజకీయాలు.. ప్రజలతో సత్సంబంధాలు కలిగిన కుటుంబం నల్లపరెడ్డిదని చెప్పారు. ఓటమి ఎరుగని నేత శ్రీనివాసులురెడ్డి అని, అంతటి చరిత్ర గల కుటుంబ వారసుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రజలతో మమేకమై వారి అభిమానాన్ని పొందారని తెలిపారు. శ్రీనివాసులురెడ్డి సతీమణి పెద్దావిడ ఇంట్లో ఒక్కరే ఉన్నారనే ఆలోచన చేయకుండా.. మానవత్వాన్ని మరిచి రౌడీ మూకలు దాడి చేయడం దారుణమన్నారు. బిహార్ తరహా రాజకీయాలను కూటమి ప్రభుత్వం పరిచయం చేస్తోందని ఆరోపించారు. ప్రసన్న ఇంటిపై దాడి జరిగితే కారకులైన రౌడీషీటర్లకు పోలీసులు కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. ఆయన కుటుంబాన్ని తమ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. అక్రమ కేసులను బనాయించడంలో పీహెచ్‌డీని ఎస్పీ చేశారని విమర్శించారు.

పోలీసుల తీరు సరికాదు

జిల్లాలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు సరికాదని కాకాణి పేర్కొన్నారు. దాడి చేసిన వారికి అధికార పార్టీతో సంబంధం లేకపోతే కేసుల నమోదుకు పోలీసులు ఎందుకు జంకుతున్నారని ప్రశ్నించారు. దాడి చేసిన వారిని కాపాడుతూ మొక్కుబడిగా అరెస్ట్ చేసి మళ్లీ విడిచిపెట్టడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. న్యాయస్థానాన్ని ప్రసన్న ఆశ్రయించారని, నిర్దోషిగా తీర్పొస్తుందని చెప్పారు. ప్రసన్న కుమార్‌రెడ్డికి జిల్లా ప్రజలు, పార్టీ అండగా నిలుస్తోందని తెలిపారు. ఈ ఘటన టీడీపీ పతనానికి నాంది పలకనుందని చెప్పారు. కారకులపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్సీపీలో పలు విభాగాల్లో నియామకాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోని పలు విభాగాల్లో పలువుర్ని నియమిస్తూ ఉత్తర్వులను పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం విడుదల చేసింది. పార్టీ ప్రచార విభాగ కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఖాదర్‌బాషా (ఆత్మకూరు), ఈశ్వరక శ్రీనివాసులురెడ్డి (సూళ్లూరుపేట), ప్రధాన కార్యదర్శిగా చింతలపూడి మోహన్‌రెడ్డి, సెక్రటరీలుగా కూరపాటి వెంకటరామిరెడ్డి (కందుకూరు), ముడి మల్లికార్జునరెడ్డి (ఆత్మకూరు), నెల్లూరు వెంకటరమణయ్య (కోవూరు), ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పిరట్ల సింగయ్య, మార్తాల రమణారెడ్డి, అనంతచంద్రయ్య (కందుకూరు), శ్రీరామనాయుడు (సూళ్లూరుపేట), కొల్లి దొరస్వామినాయుడు (ఆత్మకూరు), కనిశెట్టి సుబ్రహ్మణ్యం, చేజర్ల సుధాకర్‌రెడ్డి (కోవూరు)ను నియమించారు.

– ఇంటెలెక్చువల్స్ ఫోరమ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కట్టా కమలాకర్‌రెడ్డి (సూళ్లూరుపేట), జనరల్ సెక్రటరీగా గంగవరపు శ్రీనివాసులునాయుడు(ఆత్మకూరు), సెక్రటరీగా గోపిరెడ్డి భాస్కర్‌రెడ్డి (కోవూరు), ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా చక్కా సింగయ్య (కందుకూరు), చిరంజీవి (ఆత్మకూరు), తేళ్ల శేఖర్‌రెడ్డి (ఆత్మకూరు), తోడేటి మహేష్ (కోవూరు), పొంగూరు హేమంత్‌కుమార్‌రెడ్డి (సూళ్లూరుపేట), శివారెడ్డి (వెంకటగిరి) నియమితులయ్యారు.

వేడుకగా పవిత్రోత్సవాలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నిత్య హోమాలు, గోపురోత్సవం, హోమాలు తదితరాలను శుక్రవారం జరిపారు. ఉభయకర్తగా ఆరణి కందప్ప మేస్త్రి సత్ర ఈఓ వ్యవహరించారు. విశేషాలంకారంలో కొలువైన రంగడ్ని భక్తులు దర్శించుకున్నారు. ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.



విశేషాలంకారంలో రంగనాథుడు

విశేషాలంకారంలో లక్ష్మీనృసింహుడు



రాపూరు: పవిత్రోత్సవాల్లో భాగంగా మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను తిరుచ్చిపై శుక్రవారం కొలువుదీర్చారు. అనంతరం వివిధ పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించి కోన మాడ వీధుల్లో క్షేత్రోత్సవాన్ని నిర్వహించారు. సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. స్వామి, అమ్మవార్ల ఆలయాల్లో పవిత్రాలను సమర్పించారు.

బిల్లుపాడు.. గుండె గుబేల్

- పేదలకిచ్చిన పట్టా.. తమ్ముళ్లకు తాకట్టు
- 30 ఏళ్ల క్రితం డీఫారం పట్టాలిచ్చారు..
- ఇప్పుడు ఆక్రమించారు.. ఖాళీ చేయాలంటూ నోటీసులు
- టీడీపీ నేతల కబ్జా కోరల్లో సుమారు 70 ఎకరాలకుపైనే..

పేదల చెమటతో పచ్చగా మారిన బీడు భూమిం. రెవెన్యూ అధికారుల కలం పోటుకు ఆక్రమణ భూమిగా మారింది. మూడు దశాబ్దాల క్రితం డీఫారం పట్టాలిస్తే.. చెమటోడ్చి సాగు చేసుకున్నారు. ఇప్పుడు అవినీతి అధికారులు కబ్జారాయుళ్ల కాసులకు తలొగ్గి తాకట్టు పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ భూములను టీడీపీ నేతలకు కట్టబెట్టేందుకు ఆక్రమణలంటూ నోటీసులిచ్చారు. మరో వైపు భూములు ఉన్న అధికార పార్టీలోని మోతుబరులు పోరంబోకు భూములు ఎకరాలకు ఎకరాలు కబ్జా దండయాత్ర చేస్తుంటే.. రెవెన్యూ అధికారులు మౌనమునుల్లా వ్యవహరిస్తున్నారు. కోర్టు ఆదేశాలను సైతం లెక్క చేయని రెవెన్యూం శాఖ పేద రైతు కన్నీటి చరిత్ర రాస్తోంది.

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గం చేజర్ల మండలం బిల్లుపాడుకు చెందిన పేద రైతుల గుండెలు గుభిల్లుమనేలా.. నోటీసులు జారీ చేశారు. గ్రామంలోని 23 మంది పేదలకు సుమారు 30 ఏళ్ల క్రితం గ్రామ సర్వే నంబరు 56, 134/4, 131/7, 132/7లో ఒక్కొక్కరికి ఎకరం నుంచి ఎకరన్నరం లోపు బీడు భూములను డీఫారం పట్టాలుగా ఇచ్చారు. అప్పటి నుంచి పేద రైతులు కుటుంబం మొత్తం చెమటోడ్చి బంజరు భూములను మాగాణిగా మలుచుకున్నారు. ఆ భూములను ఆయా కుటుంబాలు సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నాయి. ఆ భూములపై అధికార టీడీపీ నేతల కన్నుపడింది. రెవెన్యూ అధికారులను లోబర్చుకుని కాజేసేందుకు పెద్ద స్కెచ్చే వేశారు. ఆ పేద రైతుల సాగులో ఉన్న భూములు ఆక్రమణలు అంటూ గజ్జా పెద చెంచయ్య, ఆదిరెడ్డి చిన్నయ్య తదితర 20 మంది రైతులకు భూములను వెంటనే ఖాళీ చేయాలని తహసీల్దారు నోటీసులిచ్చారు. తాము మూడు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నామని, తమకు పట్టాలిచ్చారని పత్రాలు చూపించినా.. అర్జీలు అందజేసినా.. గ్రామ రికార్డులైన డీరిజిస్టర్, మ్యాన్యువల్ 1బి, 10(1)లో నమోదు చేయలేదంటూ కారణాలు చూపు రీసర్వేలో అవన్నీ ప్రభుత్వ భూములేనని తేలిందంటూ స్పష్టం చేశారు.

కోర్టు ఆదేశాలిచ్చినా..

ఈ క్రమంలో గత రెండు నెలల క్రితం బాధిత రైతులు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు సైతం రైతులకు అనుకూలంగా ఆ భూముల్లో రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని, ఏది చేయాలన్న చట్ట ప్రకారం తమకు తెలియపరచాలని ఆదేశాలిచ్చింది. అయినా ఇవేమి ఖాతరు చేయకుండా తహసీల్దారు మళ్లీ ఆ భూములు ఖాళీ చేయాల్సిందేనంటూ నోటీసులివ్వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

లబ్ధిదారులకే నోటీసులు

అయితే పట్టాలు ఉండి సాగు చేసుకుంటున్న రైతుల్లో 20 మందికి మాత్రమే రెవెన్యూ అధికారులు నోటీసులిచ్చారు. అయితే వీరి పొలాలకు పక్కనే ఉన్న ప్రభుత్వ పోరంబోకు, డీ ఫారం, చెరువు పోరంబోకు భూములు బిల్లుపాడుకు చెందిన అధికార పార్టీ నేతలు నలుగురు సుమారు 70 ఎకరాలకుపైగా ఆక్రమించి సాగు చేపడుతున్నారు. వీరు ఇప్పటికే మోతుబరి రైతులు. అయితే వీరిని వదిలేసి, డీఫారం పట్టాలు ఉండి.. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములను ఆక్రమిత భూములుగా నోటీసులు ఇవ్వడం ఏమిటని బాధిత పేద రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

తహసీల్దార్‌పై ఆర్డీఓ సీరియస్

చేజర్ల మండలం బిల్లుపాడులో పేద రైతుల విషయంలో రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్న విషయమై సాక్షి ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారిణి బి పావనిని సంప్రదించింది. దీంతో ఆమె వెంటనే చేజర్ల తహసీల్దారు బి మురళీకి ఫోన్ చేసి ఆ భూముల వివరాలు అడిగి తెలుసుకుంది. 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న వారికి ఇప్పటికిప్పుడు నోటీసులు ఎందుకు జారీ చేశారంటూ ప్రశ్నించింది. మిగిలిన వారికి అందరికి ఇవ్వకుండా కొందరికే నోటీసులు జారీ చేయాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించడంతో తహసీల్దారు సరైన సమాధానం చెప్పలేకపోవడంతో సీరియస్ అయ్యారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న వారి జోలికి వెళ్లొద్దని పక్షపాత వైఖరితో వ్యవహరిస్తే ఉన్నతాధికారులకు రిపోర్ట్ చేస్తానని హెచ్చరించింది.



పెద చెంచయ్య కుటుంబానికి గతంలో ప్రభుత్వం ఇచ్చిన డీఫారం పట్టా



పట్టా భూముల్లో నిమ్మచెట్లు సాగు చేసుకుంటున్న చెంచయ్య, మస్తానమ్మ దంపతులు



తహసీల్దారు పంపిన నోటీస్

ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాం

ప్రభుత్వం మాకు ఎప్పుడో ఇచ్చిన డీఫారం భూమిలో నిమ్మచెట్లు పెంచుకుంటూ వ్యవసాయం చేసుకుంటున్నాం. మాతోపాటు చాలా మంది పరిస్థితి ఇదే. అయితే ఇటీవల మేము ప్రభుత్వ భూములు ఆక్రమించామంటూ నోటీసులు ఇచ్చారు. కోర్టుకు వెళ్లితే.. ఆ భూములకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లో స్వాధీనం చేసుకోవడానికి వీల్లేదని స్పష్టం చేస్తూ ఆదేశాలిచ్చింది. కోర్టు ఆదేశాలను సైతం ధిక్కరించి రెవెన్యూ అధికారులు తిరిగి పొలాలు ఖాళీ చేయాలంటూ మరోసారి నోటీసులిచ్చారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న ప్రభుత్వం ఇచ్చిన భూములను ఖాళీ చేయమనడం ఏమి న్యాయం.

– గజ్జా పెద చెంచయ్య, మస్తానమ్మ

న్యూస్‌రీల్

పెన్షనర్ల సంఘ అధ్యక్షుడిగా ఎస్సెమ్ గౌస్



జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

నెల్లూరు(బృందావనం): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ జిల్లా శాఖ అధ్యక్షుడిగా ఎస్సెమ్ గౌస్ నియమితులయ్యారు. నెల్లూరు భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్స్ భవన్‌లో శుక్రవారం జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడారు. అనంతరం ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు ప్రభుత్వ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న కార్యక్రమాలు వివరించారు. సమావేశానికి సంఘం రాష్ట్ర కోశాధికారి ఎన్వీ సుబ్బరాయుడు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వి.శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. తొలుత జాతీయ పతాకం, అనంతరం పెన్షనర్ల సంఘ జెండాను ఆవిష్కరించారు. జిల్లా శాఖ గౌరవాధ్యక్షుడిగా విఠపు బాలసుబ్రహ్మణ్యం, అధ్యక్షుడిగా ఎస్సెమ్ గౌస్, సహాధ్యక్షుడిగా ఎన్.శ్రీనాథ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్వీవీఎస్ మూర్తి, కోశాధికారిగా జె.హజరత్తయ్య, కార్యనిర్వాహక కార్యదర్శిగా సీహెచ్ రఘునాథ్ తదితరులతో కూడిన కార్యవర్గం ఏర్పాటైంది.

పక్కాగా ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణ



సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్న విజయకుమార్

నెల్లూరు రూరల్: జిల్లాలో ఏపీపీఎస్సీ పరీక్షలను పక్కాగా ఆదివారం నిర్వహించాలని డీఆర్వో విజయకుమార్ పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు తదితరులతో కలెక్టరేట్లోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పరీక్ష ద్వారా ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయనున్నారని చెప్పారు. 15 కేంద్రాల్లో 6600 మంది పరీక్షలకు హాజరుకానున్నారని వివరించారు. నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలన్నారు. తాగునీటి వసతి తదితరాలను కల్పించాలని సూచించారు.

లోతుగా దర్యాప్తు

- అరుణను మరోసారి కస్టడీకీ తీసుకునే అవకాశం

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఆస్తి వివాదంలో ఓ వ్యక్తిని తుపాకీతో బెదిరించిన ఘటనలో అరుణ, ఆమె అనుచరులపై నవాబుపేట పోలీస్‌స్టేషన్లో కేసు ఇటీవల నమోదైన విషయం విదితమే. అసలు ఆమెకు తుపాకీ ఎలా వచ్చింది.. ఈ స్థాయిలో బెదిరింపులకు పాల్పడ్డారంటే ఆమె వెనుకెవరున్నారు.. తుపాకీ నిజమైందేనా.. డమ్మీదా.. ఇలా అనేక కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. కాగా ఆమెకు నెల్లూరు రూరల్ సబ్ డివిజన్‌ పరిధిలోని ఓ ఎస్సై సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల ఆమెను విచారించే క్రమంలో సదరు ఎస్సై వ్యవహారం బయటకొచ్చిందని, దీనిపై పోలీస్ ఉన్నతాధికారులు ఆరాతీస్తున్నారని తెలుస్తోంది.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం గురుపూజోత్సవ వేడుకల్లో భాగంగా ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించింది. ఈ మేరకు జిల్లాకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు సుబ్బారెడ్డిని శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు కల్పలతారెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 40.17 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 40.172 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల నుంచి 12,250 క్యూసెక్కుల ప్రవాహం వస్తోందని చెప్పారు.

‘కూటమి’ తెచ్చిన కష్టం


లైన్‌లో ఉండలేక వెళ్లిపోతున్న వృద్ధురాలు


నవలాకులతోటలో రేషన్ కోసం వేచి ఉన్న జనం


కొత్త కార్డుల కోసం గుమిగూడారిలా..

నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎండీయూ వాహనాలు ఇంటింటికీ వెళ్లి రేషన్ అందజేసేవి. నేడు లబ్ధిదారులు పనులు మానుకుని షాపుల ముందు క్యూలైన్‌లో ఉంటున్నారు. శుక్రవారం నెల్లూరు నవలాకులతోట ప్రాంతంలో రేషన్ దుకాణం వద్ద బియ్యం తీసుకునేందుకు గంటల తరబడి వేచి చూశారు. కొందరు వృద్ధులు ఉండలేక బియ్యం తీసుకోకుండానే వెళ్లిపోయారు. మరోవైపు నూతన కార్డులు తీసుకునేందుకు అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం పెడుతున్న కష్టాలపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు




గంటల తరబడి నిలబడి రేషన్ తీసుకెళ్తూ..

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

• బాణసంచా పేలుడుతో ప్రమాదం

కోవూరు: పట్టణంలోని సత్రం వీధికి చెందిన గణేష్ నిమజ్జన ఊరేగింపులో గురువారం రాత్రి అపశ్రుతి చోటు చేసుకుంది. లైటింగ్ కోసం ఏర్పాటు చేసిన బ్యాటరీ వాహనం ఊరేగింపు ముందు వెళ్తోంది. అందులో జిలెటిన్ స్టిక్స్ ఉన్నాయి. ఉత్సవం సందర్భంగా బాణసంచా కాల్చారు. దీంతో నిప్పురవ్వలు స్టిక్స్‌పై పడి పేలిపోయాయి. బ్యాటరీ వాహనానికి మంటలు అంటుకోవడంతో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో సమీపంలో ఉన్న సాయిబాబా మెడికల్ షాప్ యజమాని బ్రహ్మయ్య భార్య లక్ష్మి (45) తీవ్రంగా గాయపడగా వెంటనే ఆమెను నెల్లూరులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు. అదేవిధంగా అక్కడే ఉన్న రాందేవ్‌బాబా (20) అనే యువకుడు స్వల్పంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ఉత్సవ కమిటీలోని ఐదుగురిపై కేసు నమోదు చేశారు. పేలుడు వల్ల సమీపంలో ఉన్న భవనాలు దెబ్బతిన్నాయి.


దెబ్బతిన్న భవనం

• కొండ ప్రాంతాల్లో రాళ్లు పేల్చడానికి వాడే జిలెటిన్ స్టిక్స్ వెలుగు చూడటంతో ప్రజల్లో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏమి చేస్తోందని ప్రశ్నిస్తున్నారు. ఉత్సవాల సమయంలో భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం పూర్తిగా నిర్లక్ష్యం వహించిందని విమర్శలున్నారు. గాయపడిన మహిళ పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో కోవూరులో ఉద్రిక్తత నెలకొంది.

నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం

• ఘనంగా గురుపూజోత్సవం

నెల్లూరు రూరల్: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో శుక్రవారం జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ రానున్న ఐదు, పది సంవత్సరాల కాలంలో విద్యావ్యవస్థలో వచ్చే మార్పుల్ని దృష్టిలో ఉంచుకుని టీచర్లు శిక్షణ పొందాలన్నారు. జిల్లాలో ఎంపీఎస్ (మోడల్ ప్రైమరీ స్కూల్) వ్యవస్థను విజయవంతంగా నడిపించే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు సమన్వయంతో పనిచేస్తే విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావొచ్చన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ జీవితంలో తల్లిదండ్రుల తర్వాత మర్చిపోలేని వ్యక్తులు గురువులే అన్నారు. డీఈఓ డాక్టర్ బాలాజీరావు మాట్లాడుతూ జిల్లాలో 15 మంది స్కూల్ అసిస్టెంట్లు 25 మంది ఎస్జీటీలు, ఇద్దరు స్కాట్ టీచర్లను అవార్డులతో సత్కరించామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజినల్ చైర్మన్ సురేందర్ రెడ్డి, డీఆర్వో విజయకుమార్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సమగ్ర శిక్ష అధికారి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.


అవార్డులు అందుకున్న వారితో జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, కలెక్టర్ ఆనంద్

రైతు విభాగం అధ్యక్షుడిగా శివుని

కోవూరు: వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నెల్లూరు జిల్లా అధ్యక్షుడిగా కోవూరుకు చెందిన శివుని నారసింహులురెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలందాయి. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. రైతు సమస్యలపై పోరాటం చేస్తామన్నారు.


శివుని నారసింహులురెడ్డి

ప్రభుత్వమే ధాన్యం కొనాలని డిమాండ్

నెల్లూరు(అర్బన్): జిల్లాలో రైతులు పండించిన ఎడగారు (రెండో పంట) వరి ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఏవీఆర్ నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు నెల్లూరులో కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రాన్ని అందించారు. కోటిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం కనీస మద్దతు ధర పుట్టికి రూ.19,720 అని ప్రకటించి చేతులు దులుపుకొందన్నారు. ప్రభుత్వం ధాన్యం సేకరించకపోవడంతో దళారులు రూ.15 వేల నుంచి రూ.16 వేలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారన్నారు. కనీస మద్దతు ధర కూడా వాస్తవానికి రైతులకు గిట్టుబాటు కాదన్నారు. రైతులకు యూరియా దొరక్క నానా ఇబ్బందులు పడి పంట పండించి కూడా పుట్టికి రూ.4 వేల వరకు నష్టపోతున్నారన్నారు. వరి కోతలు ప్రారంభ దశలోనే ఇలానే ఉంటే మిగిలిన రోజుల్లో పరిస్థితి దారుణంగా ఉంటుందన్నారు. ఇక కౌలుకు చేసే అన్నదాతల స్థితి ఇంకెంత దారుణంగా ఉంటుందో అర్థం చేసుకోవాలని కోరారు. ఇప్పటికైనా స్పందించి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి న్యాయం చేయాలన్నారు. తక్కువకు కొనుగోలు చేస్తున్న దళారులపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు.

ఉద్యమాలకు ఉద్యోగులు సిద్ధం కావాలి

• డివిజన్ స్థాయిలో సంఘాల బలోపేతం
• ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు


మాట్లాడుతున్న ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, పక్కన జిల్లా చైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డి తదితరులు

నెల్లూరు(అర్బన్): ‘ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదు. ఉద్యోగులు తమ హక్కులు సాధించుకునేందుకు ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలి’ అని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు సూచించారు. జేఏసీలో భాగస్వామ్య పక్షాలైన వివిధ ప్రభుత్వ శాఖల అసోసియేషన్ నాయకులు, రాష్ట్ర నాయకులతో కలిసి శుక్రవారం నెల్లూరు దర్గామిట్టలోని నెల్లూరు క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో బొప్పరాజు పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులకు సంబంధించి రావాల్సిన పెండింగ్ బకాయిలు, ఇతర సౌకర్యాలు సాధించుకునేందుకు మరోమారు అందరిని కలుపుకొని పోరాటం చేయాలన్నారు. పోలీసుల సమస్యలనే ముందుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారితోపాటు అన్ని శాఖల ఉద్యోగులకు పీఆర్సీ, డీఏలు, ఆర్జిత సెలవుల నగదు, పెన్షన్ నగదు తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. పోరాటాలు చేయాలంటే తమ, తమ విభాగాల్లో డివిజన్ స్థాయిలో సంఘాలను బలోపేతం చేసుకోవాలన్నారు. ఉద్యోగులతో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక విధానాలు గురించి చర్చించాలన్నారు. ఉద్యమంలో మహిళలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. మహిళలకు ప్రసూతి సెలవుల్ని కేంద్ర ప్రభుత్వం మాదిరిగా రెండు సంవత్సరాలకు పెంచాలని కోరామన్నారు. మరోవైపు ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను విడుదల చేయించేందుకు పోరాట ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. ఇందుకోసం ఇప్పటికే ఉమ్మడి 12 జిల్లాల్లో జేఏసీ సమావేశాలు పూర్తి చేశామన్నారు. చిత్తూరు జిల్లాలో కూడా సమావేశం పూర్తి చేసి అనంతరం భాగస్వామ్య పక్షాలతో కలిసి ఉద్యమ ప్రణాళికను సిద్ధం చేస్తామన్నారు.

• వివిధ శాఖలకు చెందిన అసోసియేషన్ల ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వ తీరును నిరసించారు. ఏపీజేఏసీ జిల్లా చైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పోలీసు ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసులు, వెటర్నరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జయప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కుమార్‌రెడ్డి, ఫైర్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్ర, పీఆర్ ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాబూరావు, క్లాస్ – 4 అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, వార్డు సచివాలయ అధ్యక్షుడు థామస్, హెడ్ మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చెంచురామయ్య, ఏపీ జేఏసీ మహిళా వింగ్ చైర్మన్ సోమిశెట్టి వసంతకుమారి, ప్రధాన కార్యదర్శి చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

మూడు కేజీల గంజాయి స్వాధీనం

నెల్లూరు సిటీ: మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరు రౌడీషీటర్లను నెల్లూరు దర్గామిట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. పోస్టల్ కాలనీ ఆరో క్రాస్‌రోడ్డులో నివాసముంటున్న ఎం.ప్రవీణ్ అలియాస్ చింటూ, కనుపర్తిపాడు గ్రామానికి చెందిన హెచ్.రవికిరణ్ అలియాస్ బాబు అనే రౌడీషీటర్లు శుక్రవారం పొదలకూరురోడ్డులోని కేన్సర్ హాస్పిటల్‌కు సమీపంలోని ప్రభుత్వాస్పత్రి ప్రహరీ వద్ద గంజాయి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ క్రమంలో స్థానికుల సమాచారం మేరకు దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్య తన సిబ్బందితో వెళ్లి దాడులు చేశారు. వారి వద్ద 3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులపై కేసులున్నట్లు సమాచారం.

రైలు ఢీకొని..

• గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు సిటీ: వేదాయపాళెం – వెంకటాచలం రైల్వేస్టేషన్ల మధ్య పడారుపల్లి లైన్స్‌పై గుర్తుతెలియని వ్యక్తిని రైలు ఢీకొనడంతో మృతిచెందిన ఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. పడారుపల్లికి సమీపంలో మృతదేహం పట్టాలపై ఉంది. స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి వయసు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. నలుపు రంగు కట్ బనియన్, గోధుమ రంగు ప్యాంట్ ధరించి ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెడికవర్‌లో వాస్కులర్ సర్జరీ సేవలు ప్రారంభం

నెల్లూరు(అర్బన్): నగరంలోని మెడికవర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో నెల్లూరులోనే తొలిసారిగా పూర్తి స్థాయిలో వాస్కులర్, ఎండో వాస్కులర్ సర్జరీ సూపర్ స్పెషాలిటీ సేవలు ప్రారంభించామని ఆ విభాగం కన్సల్టెంట్ సర్జన్ డాక్టర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆస్పత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చెన్నై, హైదరాబాద్‌కు వెళ్లే అవసరం లేకుండా సేవలందిస్తున్నామన్నారు. మధుమేహ రోగుల్లో రక్త ప్రసరణ తగ్గినప్పుడు కాలి వేళ్లు, కాలు తీసేయాల్సిన అవసరం లేకుండా వైద్యం చేస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదంలో రక్త నాళాలు దెబ్బతింటే వాటికి సర్జరీ చేసి సరి చేయడం జరుగుతుందన్నారు. డయాలసిస్ కోసం ఫిస్టులా గ్రాఫ్ట్ శస్త్రచికిత్సలు అత్యాధునిక సాంకేతిక నైపుణ్యంతో నిర్వహిస్తామన్నారు సెంటర్ హెడ్ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో పూర్తి స్థాయి సేవలందించే వాస్కులర్ సర్జన్ విభాగం మెడికవర్‌లో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. సమావేశంలో మెడికల్ సూపరింటెండెంట్ డా.అభిజిత్, మార్కెటింగ్ హెడ్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సర్జన్ సుదర్శన్‌రెడ్డి

మాజీ మిలటరీ ఉద్యోగిపై దాడి

వెంకటాచలం: మండలంలోని సర్వేపల్లి పంచాయతీ ముత్యాలగుంట గ్రామంలో మాజీ మిలటరీ ఉద్యోగి బొమ్మ రామయ్యపై అదే ఊరికి చెందిన ఐదుగురు వ్యక్తులు దాడి చేసి గాయపరిచిన ఘటన గురువారం రాత్రి జరిగింది. బాధితుడి వివరాల మేరకు.. రామయ్య కుమారుడు సాయితేజ్‌తో స్థానికులతో గొడవ జరిగింది. ఈ విషయం తెలుసుకున్న రామయ్య అక్కడికి చేరుకుని ఎందుకు గొడవ పడుతున్నారని ప్రశ్నించడంతో మోహన్‌రావు, ప్రసన్నకుమార్, చింటూ, మరో ఇద్దరు కలిసి దాడి చేయడంతో రక్త గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు రామయ్యను చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. శుక్రవారం ఉదయం వెంకటాచలం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేసి న్యాయం చేయాలని కోరాడు.


రామయ్య

యువకులను కాపాడిన మెరైన్ పోలీసులు


తీరంలో యువకులతో పోలీసులు

కావలి(జలదంకి): కావలి రూరల్ మండలం తుమ్మలపెంట సముద్ర తీరంలో ఇద్దరు యువకులు గల్లంతవడంతో మెరైన్ పోలీసులు సకాలంలో స్పందించి వారిని కాపాడి ఒడ్డుకు తీసుకొచ్చిన ఘటన శుక్రవారం జరిగింది. కావలికి చెందిన పి.దివాకర్, ముసునూరుకు చెందిన పి.కిశోర్‌లు సరదాగా సముద్ర స్నానానికి తుమ్మలపెంటకు వెళ్లారు. ఒక్కసారిగా అలలు ఎగసిపడటంతో వారు మునిగిపోయారు. దీనిని గమనించిన మెరైన్ ఎస్సై జానకిరామయ్య, కానిస్టేబుల్ బాలసుబ్రహ్మణ్యం స్థానిక మత్స్యకారుడు చిన్నస్వామి సహకారంతో వారిని కాపాడి ఒడ్డుకు చేర్చారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ – ఉన్ – నబీ


ర్యాలీ చేస్తున్న ముస్లింలు


ర్యాలీలో పాల్గొన్న కాకాణి, పర్వతరెడ్డి తదితరులు

నెల్లూరు(బృందావనం): మహమ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకుని మిలాద్ – ఉన్ – నబీని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నగరంలోని మసీదుల్లో ప్రత్యేక దువా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో అన్నదానం కార్యక్రమాలను చేపట్టారు. జెండా వీధి కోటమిట్ట వద్ద ఉన్న అమీనియా మసీదు నుంచి సంప్రదాయంగా ప్రదర్శన నిర్వహించారు. ఇందులో మతపెద్దలు, ఇమామ్‌లు, మౌల్వీలు ముస్లింలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ప్రదర్శన జెండావీధి కోటమిట్ట వద్ద ఉన్న అమీనియా మసీదు నుంచి ప్రారంభమై మెయిన్‌రోడ్డు షాదీమంజిల్, చేపల మార్కెట్, వహబ్‌పేట, బారకాసు సెంటర్, ఆచారివీధి, మద్రాస్ బస్టాండ్ వీఆర్సీ, గాంధీబొమ్మ, ఏసీ సెంటర్, ములుముడి బస్టాండ్, చిన్నబజారు, పెద్దబజారు మీదుగా కోటమిట్ట చేరింది. ఇందులో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ, ఆ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఖలీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు(కిలో)



పెద్దవి : రూ.40 సన్నవి : రూ.25
పండ్లు : రూ.15

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.110
లేయర్	రూ.123
బ్రాయిలర్ చికెన్:	రూ.204
స్కిన్‌లెస్ చికెన్:	రూ.226
లేయర్ చికెన్:	రూ.210

